
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

గురువారం 22 ఫిబ్రవరి 2024

మంటల్లో సబ్‌స్టేషన్

- పేలిన ట్రాన్స్‌ఫార్మర్
- తోడైన ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్
- ఆరు గంటల పాటు ఎగిసిపడ్డ అగ్నికీలలు
- మూడు ఫైర్ ఇంజన్లు వచ్చినప్పటికీ నిష్ఫలితం
- సిద్దిపేట నియోజకవర్గంలో నిలిచిపోయిన కరెంటు సరఫరా



సిద్దిపేటలోని సబ్‌స్టేషన్‌లో ఎగసిపడుతున్న మంటలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 21: సిద్దిపేట పట్టణం ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న సబ్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 7 గంటలకు భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదవశాత్తు పేలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న ఆయిల్‌తో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దాదాపు 6 గంటల వరకు మంటలు చెలరేగాయి. సంఘటనా స్థలం వద్ద జనం భారీగా చేరుకోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ లోనికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు రూ.4కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



ప్రమాద స్థలంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దీంతో సిద్దిపేట నియోజకవర్గ గ్రామాలతో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు అర్ధరాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది.

నిర్లక్ష్యమే కారణమా?

సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం వెనుక విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నదా? అంటూ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ 1997లో సబ్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు చేసినప్పటిదని, పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇన్ని రోజులు ఎందుకు కొనసాగించారని ప్రశ్నిస్తున్నారు.

సంఘటనా స్థలానికి హరీశ్‌రావు

అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చారు. మార్గంమధ్యలోనే విద్యుత్‌శాఖ అధికారులతో ప్రమాదంపై చర్చించారు. దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ ఫైర్‌స్టేషన్లకు ఫోన్ చేసి ఫైర్ ఇంజన్లను వెంటనే సంఘటనా స్థలానికి పంపించాలని కోరారు. విద్యుత్ శాఖ మంత్రి విక్రమార్కకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. విద్యుత్ పునరుద్ధరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటనా స్థలానికి దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి సహా చేరుకొని దాదాపు మూడు గంటల పాటు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఫైర్ ఇంజన్‌లో నీళ్ల తగ్గినా కొద్దీ మున్సిపాలిటీ ట్యాంకర్లతో తెప్పించి ఫైర్‌ఇంజన్‌లో నింపించి మంటలు అదుపు చేయించారు. మంటలు తగ్గుముఖం పట్టిన తర్వాతనే సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు.



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది



అంధకారంలో సిద్దిపేట పట్టణం

అంధకారంలో సిద్దిపేట

సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో సిద్దిపేట పట్టణం పూర్తిగా అంధకాంలో ఉండిపోయింది. సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. వ్యాపారులు ఏడు గంటలకే దుకాణాలు మూసేశారు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, లాప్‌ట్యాప్‌లు చార్జింగ్ లేక మూగబోయాయి.



కరెంటు సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలో సిద్దిపేట బస్టాండ్



బడికెళ్లే.. బాల్యం బరువు మోస్తోంది

- ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కష్టాలు

పుస్తకం, పలక, బలపం పట్టాల్సిన విద్యార్థుల చేతులు వాటర్‌క్యాన్లు మోస్తున్నాయి. ఉపాధ్యాయుల కోసమో లేదా తమ దాహార్తిని తీర్చుకోవడానికోగానీ వాటర్ క్యాన్ల భారాన్ని భుజానికెత్తుకున్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పాఠశాలలో తాగునీటి సౌకర్యంతో పాటు స్కావెంజర్లు లేకపోవడంతో కొద్దిరోజులుగా విద్యార్థులు వంతులవారీగా గ్రామపంచాయతీ వాటర్‌ప్లాంట్ నుంచి క్యాన్లను మోసుకొస్తున్నారు. అధిక బరువును మోయలేక కర్రల సాయంతో తీసుకొస్తున్నారు. అయితే ఈ దారి గుండా కొమురవెల్లి నుంచి కొండపోచమ్మకు వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. రోడ్డు దాటే క్రమంలో ఏదేని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య గురించి ఉపాధ్యాయులకు తెలిసినా కనీసం ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలలో నీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

- చేర్యాల, ఫిబ్రవరి 21

తప్పుడు ధ్రువీకరణ పత్రాలకు రూ.27 కోట్ల రుణం

- యూనియన్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21: తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రూ.27 కోట్ల రుణం జారీ చేసిన బ్యాంకు సిబ్బందిని రామచంద్రాపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రామచంద్రాపురం ఆంధ్రా బ్యాంక్ (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్)లో 2016 వరకు మంజూరైన వ్యాపార రుణాలలో భారీగా అవకతవకలు జరిగాయని అప్పట్లోనే బ్యాంక్ ఆడిటర్లు గుర్తించారు. ఈ మేరకు 2021లో బ్యాంక్ ఆడిటర్ల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 17 కంపెనీలకు మంజూరు చేసిన రుణాల్లో సుమారు రూ.27 కోట్ల మేర అవతవకలు జరిగాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార ఫర్మ్‌లు, తనఖా పెట్టిన ఆస్తుల విలువను అధిక రెట్లు పెంచి ఇచ్చిన నకిలీ పత్రాల ఆధారంగా కోట్లాది రూపాయల రుణాలను మంజూరు చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న బ్యాంకు సిబ్బంది, వాల్యువేటర్, లీగల్ అడ్వైజర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్య హత్యకు భర్త సుపారీ

- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 21: నిత్యం గొడవలు పడుతూ మనశ్శాంతి లేకుండా చేస్తుందన్న కారణంతో మొదటి భార్యను సుపారీ ఇచ్చి హత్య చేయించిన భర్తను, నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా హవేళీఘణపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఆదికేశవులు వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మంద సంగమణి(51), రెండో భార్య మంజులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొత్తగా కట్టుకున్న ఇల్లు, పొలం విషయంలో కొంతకాలంగా ఆశయ్యకు, సంగమనికి గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో మొదటి భార్యను ఎలాగైనా వదిలించుకోవాలని ఆశయ్య పథకం పన్నాడు. ఇందులో భాగంగా అదే గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్‌కు తన భార్య సంగమనిని చంపితే రూ.20 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఆశయ్య ఈ నెల 11న రెండో భార్య మంజులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి మహేష్ ఆశయ్య చెప్పినట్లుగా ఇంటి కమాన్ పొయ్యి రంధ్రం నుంచి లోపలికి దిగాడు. డోరు తీయగా.. మరో నిందితుడు శివకుమార్ ఇంటిలోకి వచ్చాడు. ఈ ఇద్దరు నిద్రిస్తున్న సంగమణి గొంతుపై తలపీటతో నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బెడ్‌పైన ఉన్న బ్యాగులోని రూ.20 వేలను, చెవి కమ్మలు, పుస్తెలతాడును తీసుకుని పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు చాకచక్యంగా విచారణ జరిపి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

వరిపంటపై మొగి పిడుగు

- జిల్లా వ్యాప్తంగా తెగుళ్లు
- మరోవైపు సల్ఫైడ్ ఉధృతి
- అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం
- ఆందోళనలో జిల్లా రైతాంగం
- దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం!



వరిలో మొగిపురుగు

గజ్వేల్, ఫిబ్రవరి 21 : వరి రైతులపై మొగి పురుగు పిడుగు పడింది. ఓ వైపు సల్ఫైడ్ ప్రభావం, మరో వైపు మొగి పురుగు ఉధృతితో వరిసాగు చేసిన రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సమస్య రైతులను పట్టిపీడిస్తున్నప్పటికీ వారికి అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

సిద్దిపేట జిల్లాలో భారీ నీటిపారుదల రిజర్వాయర్లు అందుబాటులోకి రావడంతో రైతులు అధికశాతం వరిసాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3.40లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సాగుతో పాటు పంటకు తెగుళ్ల బెడద కూడా అధికంగా ఉంది. జిల్లాలో అక్కడక్కడా అధికారులు పర్యటిస్తున్నా కేవలం ఫొటోలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఇష్టానుసారంగా ఎరువులు, ఇతర మందులను పిచికారి చేస్తున్నారు. మొగిపురుగు, సల్ఫైడ్ ప్రభావంతో ఈ ఏడాది భారీగా పంటల దిగుబడి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్టుబడి పెరిగి దిగుబడులు తగ్గే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



గజ్వేల్ మండల పరిధిలో సల్ఫైడ్ ప్రభావంతో ఎర్రబడిన వరిపంట

సల్ఫైడ్ దుష్ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం

వానాకాలం, యాసంగిలో ఒకే పంటను సాగు చేయడం, ఏళ్లుగా పంట మార్పిడి చేపట్టకపోవడంతో వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావానికి గురవుతున్నది. ఫలితంగా పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నది. అలాగే అధిక నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవడంతో సల్ఫైడ్ బారిన పడ్డాయి. సాగునీటి పారుదల, చెరువుల కింద ఉన్న భూముల్లో ఈ సమస్య అధికంగా ఉంది. వరిలో అక్కడక్కడ గుంపులుగుంపులుగా పసుపువర్ణంలో మారడంతో ఎదుగుదల క్షీణిస్తుంది. వరి కుళ్లిన వాసన, బుడగల రూపంలో గాలి బయటకు రావడం, వేర్లు కుళ్లిన వాసన వస్తుంది.

మొగిపురుగు ధాటికి తగ్గనున్న దిగుబడులు

ఇటీవల ఉష్ణోగ్రతలు పడిపోవడం, నత్రజని తక్కువగా వాడటంతో కాండం బలహీనపడి వరిపంటను మొగిపురుగు ఆశిస్తుంది. యాసంగిలో ప్రతి ఏటా రైతులను మొగి పురుగు ఇబ్బంది పెడుతున్నా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించలేకపోతున్నారు.

విచ్చలవిడిగా మందులు, ఎరువుల వాడకం

అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవడంతో రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులను వాడుతూ భారీగా పెట్టుబడులను పెడుతున్నారు. డీలర్లు ఇచ్చిన మందులు, ఎరువులను విచ్చలవిడిగా వాడుతూ నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు పటిష్ట ప్రణాళికతో రైతులకు సల్ఫైడ్, మొగిపురుగుపై అవగాహన సదస్సులు వివరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



మొగిపురుగు ఉధృతికి దెబ్బతిన్న కుకునూరుపల్లి మండల కేంద్రంలోని వరిపంట

తెగుళ్లతో.. తంటా

- మిర్చి పంటకూ తెగుళ్లు..



చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులో తెగుళ్లు సోకడంతో దెబ్బతిన్న మిర్చి పంట

చిన్నకోడూరు, ఫిబ్రవరి 21 : మిర్చి పంటకు తెగుళ్ల బెడద వెంటాడుతున్నది. ప్రతిసారీ రైతులకు నష్టాల ఘాటే మిగులుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో నల్లతామర, ఎర్రనల్లి, పచ్చదోమ, కుచ్చు ముడత, బూడిద తెగుళ్ల వల్ల పూత, కాయ రాలిపోయి మొక్క వాలిపోతున్నది. చిన్నకోడూరు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగుచేశారు. గతేడాది మిర్చికి మంచి ధర ఉండటంతో ఈసారి కూడా అధికంగా సాగుచేశారు. అయితే చీడపీడ తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత, కాయ రాలిపోతుంది

30 గుంటల్లో మిర్చి పంటను సాగు చేశాను. పెట్టుబడికి దాదాపు రూ.25వేల వరకు ఖర్చయింది. పంటకు తెగుళ్లు సోకడంతో అదనంగా మరో రూ.15వేల వరకు ఖర్చు పెరిగింది. ప్రస్తుతం పంట పిందె దశలో ఉంది. మొక్క ఎదుగుదల లేక పూత, కాయ రాలిపోతుంది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేదు. ఎప్పుడు సాగు చేసే మిర్చి విత్తనాలు దొరక్క ఈ సారి ఇతర కంపెనీ విత్తనాలతో పంట సాగుచేశాను.

- కె. నాగరాజు, రైతు, చిన్నకోడూరు

సారలమ్మ రాకతో పులకించిన భక్తజనం

డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ బుధవారం సారలమ్మ గద్దెపైకి చేరుకున్నది. కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద గురువారం భక్తులు అధికంగా తరలివచ్చే అవకాశం ఉండడంతో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



కాటిగల్‌లో సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న కోయపూజారులు



కొమురవెల్లిలో అమ్మవార్ల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

వార్త 8లో..

పేదలకు పనులు కల్పించి ఉపాధి చూపించాలి

● ప్రజాదర్బార్‌లో డీఆర్డీవో అదనపు పీడీ విరోజా

తూప్రాన్, ఫిబ్రవరి 21: పేదలకు పనులు కల్పించి ఉపాధిని చూపించాలని మెదక్ అదనపు డీఆర్డీవో పీడీ విరోజా పేర్కొన్నారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 14వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విరోజా మాట్లాడుతూ తూప్రాన్ మండలం పనులు కల్పించడంలో వెనుకబడిపోయిందని, ఈ పరిస్థితి రాకుండా చూడాలన్నారు. తూప్రాన్ మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధిహామీ పథకంపై ఈనెల 11 నుంచి 20 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఏడాదికాలంలో రూ.3,36,32,890 విలువైన పనులు చేపట్టగా కూలీలకు రూ.2,93,70,500లు, మెటీరియల్‌కు రూ.42,62,390 చెల్లింపులు చేశారు. ప్రజాదర్బార్‌లో ఊరూర చేపట్టిన పనులు, జరిగిన అవకతవకలు వివరించారు. ఈ పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.1,19,408 రికవరీకి రాసినట్లు విరోజా వివరించారు. పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యంపై రూ.7 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డి స్వప్న, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ ప్రభాకర్, క్వాలిటీ రమాకాంత్, ఏపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న డీఆర్డీవో అదనపు పీడీ విరోజా

లారీని ఢీకొన్న కారు, వ్యక్తి మృతి

జహీరాబాద్, ఫిబ్రవరి 21: కారుతో లారీని వెనక నుంచి ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం.. బీదర్ జిల్లా నౌబాద్‌కు చెందిన శివశంకర్(36), మరో ముగ్గురు స్నేహితులు కలిసి శ్రీశైలం నుంచి కారులో నౌబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్ పట్టణ సమీపం అల్గోల్ చౌరస్తాలోని బైపాస్‌పై లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టారు. దీంతో శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌లో న్యాయం అందేలా చూడండి

● సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, రాజీపడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



మేడారం.. జన సంద్రం..

● లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం ● కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం ● సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర ● ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెల రోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా

● 14 మంది కౌన్సిలర్ల గైర్హాజరు
● గతంలో డ్రా చేసిన నిధుల లెక్కలు చెప్పాలని పట్టు
● కోరం లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయిన అదనపు కలెక్టర్
● అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన కౌన్సిలర్లు



సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిల్‌లో మరోసారి ముసలం రాజుకున్నది. గతేడాది మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిపై అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించిన కౌన్సిలర్లు మరోసారి లెక్కల్లో తేడాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేయగా, 14 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. కేవలం ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరుకావడంతో కోరం లేక వాయిదా వేశారు. ఈ సమావేశానికి వచ్చిన సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడిన విషయం తెలుసుకుని తిరిగి వెళ్లిపోయారు. కాగా గత సర్వసభ్య సమావేశంలోని ఎజెండాలో పెట్టిన పలు అంశాల విషయమై తలెత్తిన సందేహాలను నివృత్తి చేయకపోవడంతో సమావేశానికి గైర్హాజరైనట్లు తెలిపారు. అంతేకాకుండా జనరల్ ఫండ్ నుంచి డంపింగ్ యార్డు, రాజీవ్‌పార్కుకు నిధులు పెట్టారని, వార్డులలో చిన్న చిన్న సమస్యలు తలెత్తితే వాటికి నిధులు కేటాయించడం లేదని కౌన్సిలర్లు తెలిపారు. ముఖ్యంగా గతేడాది ట్రీగార్డులకు సంబంధించిన నిధులు గోల్‌మాల్ అయ్యాయని, ట్రీగార్డులు మునిసిపాలిటీకి రాకున్నా నిధులను డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పు చేయలేదని, అసంబద్ధ ఆరోపణలకు కౌన్సిలర్లు దిగుతున్నారని తెలిపారు.

అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని కోరిన కౌన్సిలర్లు

అసంతృప్తిగా ఉన్న 14 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు గతంలో ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఫిబ్రవరి 9, 2023 రోజుల ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని, బల నిరూపణకు తేదీని ప్రకటించాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు బొగ్గుల చందు, బాలమణి, రజిత, వరలక్ష్మి, కూరాకుల శ్రీనివాస్, అత్తెల్లి శ్రీనివాస్, విద్యారాణి, బాలేష్ ఉన్నారు.

క్రమశిక్షణతో పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలి

● సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: క్రమశిక్షణతో శిక్షణను పూర్తిచేసి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి సూచించారు. కంది మండల చిద్రుప్ప గ్రామంలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న ట్రైనీ పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో శరీరదారుఢ్యంతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్, తదితర అంశాలను బోధిస్తారని తెలిపారు. తొమ్మిది నెలలపాటు పొందే శిక్షణ మిమ్మల్ని శారీరకంగా దృఢపర్చడమే కాకుండా మానసిక వికాసాన్ని పెంపొందిస్తున్నదన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వృత్తి ధర్మాన్ని పాటించే ఆత్మస్థైర్యాన్ని నింపడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర పోలీస్‌శాఖకు మంచి సేవలందించాలని సూచించారు. ట్రైనీ పోలీసులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ సంజీవ్‌రావు మాట్లాడుతూ గతంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి పదో తరగతి, ఇంటర్ అర్హత గల వారు భర్తీ అయ్యే వారని, కానీ ప్రస్తుతం ఉన్నత చదువులు డిగ్రీ, బీటెక్, ఎంటెక్ అర్హత కలిగి ప్రజలకు దగ్గరగా ఉంటూ వారికి రక్షణ కల్పించే పోలీసు వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. శిక్షణలో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్ఐ శ్రీనివాస్, లా క్లాస్ శిక్షకుడు రాంబాబు, ఎస్‌బీ సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చిద్రుప్పలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి

కిడ్నాపర్ అనుకుని.. దేహశుద్ధి

● పోలీసులకు అప్పగింత

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడనే నెపంతో ఓ వ్యక్తిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహిళా ప్రాంగణం కార్యాలయ సమీపం కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటున్నాడు. ఇంతలో ఓ యువకుడు బయటకు రమ్మని పిలుస్తున్నాడంటూ పిల్లాడి తల్లి కేకలు వేసుకుంటూ ఇంట్లోకి పరుగులు పెట్టింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు బాలుడిని ఎందుకు పిలుస్తున్నావంటూ ఆ వ్యక్తిని నిలదీయగా సమాధానం చెప్పేందుకు తడబడ్డాడు. దీంతో కాలనీవాసులు ఆగ్రహించి అతడిని స్తంభానికి కట్టేసి చితకబాదారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా జార్ఖండ్ వాసిగా తెలిసింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

● ఇద్దరు యువకులు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
● సంగాపూర్ రోడ్డులో ప్రమాదం

గజ్వేల్, ఫిబ్రవరి 21: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులో బుధవారం చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి-బందారం గ్రామానికి చెందిన గడ్డమీది అరుణ్(20), తన స్నేహితుడైన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతిధర్మారం గ్రామానికి చెందిన నక్కాని దిలీప్‌తో కలిసి వారు ఉంటున్న హాస్టల్ నుంచి బుక్స్ తెచ్చుకోవడానికి గజ్వేల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన మహ్మద్ అయాన్(21)ను సంగాపూర్‌లోని హాస్టల్ వద్ద లిఫ్ట్ అడగ్గా ఎక్కించుకున్నాడు. బాలికల ఎడ్యుకేషన్ హబ్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గడ్డమీది అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ నడుపుతున్న అయాన్, మధ్యలో కూర్చున్న దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, అక్కడున్న వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులతో పాటు అరుణ్ మృతదేహాన్ని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అయాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. అరుణ్ తండ్రి గడ్డమీది శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాదంలో మృతిచెందిన గడ్డమీది అరుణ్, అయాన్

పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలి

● సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



గజ్వేల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

గజ్వేల్, ఫిబ్రవరి 21: పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని అధికారులకు, తల్లిదండ్రులకు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని అంగన్వాడీ కేంద్రం-11ను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో చిన్న వయసు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలని, పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడకుండా అంగన్‌వాడీల్లో పంపిణీ చేసే బాలామృతం, బాలామృతం ప్లస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలను వివరించారు. ప్రతీ గర్భిణీ పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. కేంద్రానికి సరఫరా అయ్యే గుడ్ల నాణ్యత, పరిమాణాన్ని ఆమె పరిశీలించారు. వెంట సీడీపీవో వెంకటరాజమ్మ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, శ్రీగిరిపల్లి వైద్యాధికారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉన్నారు.



నంగునూరు: అక్కెనపల్లిలో సారలమ్మను గద్దెకు తెస్తున్న భక్తులు



కొమురవెల్లిలో నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తున్న భక్తులు



కూటిగల్‌లో సారలమ్మ తల్లిని గద్దెపై ప్రతిష్ఠించిన కోయపూజారులు

గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

సమ్మక్క - సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాలోని ఆయా మండలాల్లో ముస్తాబైన గద్దెలపై సారలమ్మ తల్లి కొలుదీరింది. ఈ సందర్భంగా భక్తులు దప్పుచప్పుళ్లు, శివసత్తుల విన్యాసాల మధ్య సారలమ్మకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

నంగునూరు, ఫిబ్రవరి 21: మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో సమ్మక్క - సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం దప్పు చప్పుళ్లతో, శివ సత్తుల పూనకాల మధ్య సారలమ్మను గద్దెకు చేర్చారు. గ్రామంలోని దాసరి సింగరయ్య ఇంటి నుంచి ఊరేగింపుగా ఊరి పొలిమేరలో ఉన్న గద్దెల వద్దకు సారలమ్మ తీసుకువచ్చారు. గద్దెల సమీపంలో గల పులి గుండ్ల నుంచి సమ్మక్క గద్దెకు చేరుకోనున్నది. గురువారం భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకునే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. శనివారం అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● **చేర్యాల:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకుని కొమురవెల్లి మండలకేంద్రం శివారులోని గద్దెల వద్ద అమ్మవార్ల జాతర ప్రారంభమైంది. మంగళవారం రాత్రి పగిడిద్ద రాజు గద్దెలపై కొలువుదీరగా, బుధవారం రాత్రి సారలమ్మను ప్రతిష్ఠించారు. పొరుగు మండలాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి, నిలువెత్తు బంగారంతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని బురాన్‌మియా తోటలో జాతర ప్రారంభమైంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిలువెత్తు బంగారం(బెల్లం)సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

● **మద్దూరు:** మండలంలోని కూటిగల్‌లో బుధవారం డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య సారలమ్మ తల్లి గద్దెకు చేరుకుంది. కోయపూజారులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి గద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి

● **గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని లక్ష్మాపూర్‌లో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సమ్మక్క సారలమ్మ గద్దెలను ఏర్పాటు చేశామని ఆలయ పూజారి పిట్ల పరశురాములు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే సమ్మక్క-సారలమ్మ జాతరలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం





ఘటనాస్థలంలో రోదిస్తున్న బాలుడి తల్లి, రిత్విక్(ఫైల్)

కొండపాక, ఫిబ్రవరి 21: కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం లారీ ఢీకొన్న ఘటనలో బాలుడు దుర్మరణం చెందాడు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తలపాక లావణ్య కుమారుడు రిత్విక్(6)తో కలిసి మాత్‌పల్లిలో ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలకు బయలుదేరింది. కుకునూరుపల్లిలో బస్సు దిగి ఆటో కోసం రోడ్డు దాటుతున్న క్రమంలో సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బాలుడిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడంతో ఘటనాస్థలంలో ఆ తల్లి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. బుధవారం తెల్లవారు జామున ఇందిరాగాంధీ విగ్రహం శిలాఫలాన్ని గుర్తు తెలిపిన దుండగులు ధ్వంసం చేశారు. కాంగ్రెస్‌పార్టీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు రాజేశం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు పరిశీలించి, కేసు చేపట్టినట్టు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతులను అలవాటు చేసుకోవాలి: సీఐ



విద్యార్థులతో సీఐ శ్రీను,ఎస్‌ఐ అపూర్వరెడ్డి తదితరులు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 21: విద్యార్థి దశ నుండే శాస్త్రీయ పద్ధతులను అలవాటు చేసుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవపూర్ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు- శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూజియం అద్భుతమైన మ్యాజిక్ చేసి విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి, పోలీస్ సిబ్బంది, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మద్దూరు, ఫిబ్రవరి 21 : మహిళలకు రక్షణగా నిలిచిన చట్టాలపై మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు చేర్యాల సీఐ ఎల్. శ్రీను అవగాహన కల్పించారు. పాఠశాలలో షీటీం బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌తో పాటు సైబర్ నేరాలు, షీటీమ్ విధుల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, షీటీం బృందం సైదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి, ఫిబ్రవరి 21: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని వీరాపూర్ గ్రామంలో రూ.ఐదు లక్షల నిధులతో చేపట్టిన విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీహాల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాపాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'గొర్రెల పంపిణీ' డీడీలను తిరిగి ఇవ్వాలి

కొండపాక, ఫిబ్రవరి 21 : గత ప్రభుత్వ హయాంలో రెండో విడత గొర్రెల పంపిణీ అందజేస్తామని చెప్పడంతో అప్పులు చేసి డీడీలు కట్టిన గొల్ల కురుమలకు నిరాశ ఎదురైందని సిద్దిపేట జిల్లా బీసీ అధ్యక్షుడు కందూరి అయిలయ్య పేర్కొన్నాడు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామం పంచాయతీ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం గొల్ల కురుమల నుంచి ఒక్కో యూనిట్‌కు ఒక్కొక్కరికి రూ.43,750 రూపాయల చొప్పున జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల ను ప్రభుత్వానికి డీడీల రూపంలో చెల్లించారని తెలిపారు. అయితే ఇప్పటికీ గొర్రెల పంపిణీ చేపట్టలేదన్నారు. ప్రభుత్వం వెంటనే గొల్ల కురుమలకు న్యాయం జరిగేలా డీడీలు కట్టిన వారికి తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

బండతిమ్మాపూర్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ములుగు, ఫిబ్రవరి 21: మండలంలోని బండతిమ్మాపూర్ పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులకు బుధవారం స్థానిక డాక్టర్ ఆనందరెడ్డి సైకిళ్లను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు దూరం నుంచి రావడానికి ఇబ్బంది పడుతున్నారని, వారికి సైకిళ్లు అందిస్తే సమయానికి పాఠశాలకు వస్తారనే ఉద్దేశంతో అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఎన్. శ్రీనివాస్, కర్ణశ్రీ, ఉమాదేవి, నరసింహారావు, శ్రీనివాస్, స్వప్న, వేదశ్రీ, ఉమాదేవి, మహేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు సెలవు దినాలు ప్రకటించాలి

● లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్

అక్కన్నపేట, ఫిబ్రవరి 21: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతరగా మేడారం జాతర ప్రసిద్ధికెక్కిందని, సమ్మక్క జాతరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాలు ప్రకటించాలని లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్ కోరారు. బుధవారం అక్కన్నపేటలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అతి పెద్ద జాతరైన సమ్మక్క సారక్క జాతరకు మూడు రోజులు సెలవులు ఎందుకు ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు



ఫేర్‌వెల్ డేలో విద్యార్థినుల నృత్యప్రదర్శన

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుచున్న విద్యార్థినులు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో ప్రిన్సిపాల్ డి రవీందర్, బాలుర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ రాజు, మహేశ్‌కుమార్, హెచ్ఎం వెంకటయ్య, లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, డి కరుణాకర్, సదానందం, స్వరూప, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి'

మద్దూరు, ఫిబ్రవరి 21: విద్యార్థుల కోసం పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు చొప్పరి సాగర్ ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చొప్పరిసాగర్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత ప్రయాణం మూలంగా సీట్లు ఖాళీ లేక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని సమయానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా చూడాలన్నారు.

సీపీని కలిసిన అధికారులు



సీపీ అనూరాధకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీటీవో, ఎంవీఐ

సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఫిబ్రవరి 21 : సిద్దిపేట నూతన డీటీవోగా బాధ్యతలు చేపట్టిన పి.వేణు, హుస్నాబాద్ ఎంవీఐ కొండలరావు, గజ్వేల్ ఎంవీఐ డి. క్రిస్టఫర్, సిద్దిపేట ఎంవీఐ పి. శంకర్ నారాయణ, సిద్దిపేట, ఏఎంవీఐ కే.సంతోష్‌రెడ్డి, బుధవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అదేవిధంగా గజ్వేల్‌పరిధిలోనిమక్తమాసాన్‌పల్లిలో గల బేగంపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన రవికాంత్‌రావు సీపీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

నేడు హుస్నాబాద్‌కు మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో జరిగే సమ్మక్క, సారలమ్మల జాతరలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. ఉదయం 11.30 గంటలకు సైదాపూర్ మండలం వెన్నంపల్లిలో, 11.55 గంటలకు సైదాపూర్ మండల కేంద్రంలో మధ్యాహ్నం 12.25 గంటలకు ఎల్కతుర్తి మండలం దామెరలో, 12.55 గంటలకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో, 1.25 గంటలకు ఎర్రబెల్లిలో, 1.55 కొత్తకొండలో 2.45 గంటలకు హుస్నాబాద్ పట్టణంలో, 3.25 గంటలకు అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో, 3.55 హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో, 4.25 గంటలకు కోహెడ మండలం పరివేద, 4.55 గంటలకు వింజపల్లి, సాయంత్రం 5.25 గంటలకు తంగళ్లపల్లిలోని సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకుంటారని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల, ఫిబ్రవరి 21: ముస్త్యాలకు చెందిన నవనీత ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ టెక్నాలజీతో ఎస్‌ఐ దామోదర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బుధవారం నవనీతకు అప్పగించారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



సిద్దిపేటలో సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 21: విద్యార్థులందరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో ఈ పాఠశాల వర్షం వస్తే పెచ్చులూడుతాయని బంద్ పెట్టేవారని, నేడు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తయారైందని కొనియాడారు. త్వరలోనే పాఠశాలకు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ ఎంఈవో యాదవ రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ప్రారంభించిన మాజీమంత్రి

సిద్దిపేట పట్టణంలోని శివాజీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, డాక్టర్ సాయి, డాక్టర్ అరవింద్, బీఆర్ఎస్ నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నంగునూరు, ఫిబ్రవరి 21: మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షుడు బండి వెంకటయ్య ఇటీవల మృతి చెందగా, అతడి తండ్రి బాలమల్లు సైతం బుధవారం ఉదయం మృతి చెందాడు. హరీశ్‌రావు అతడి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. అలాగే మండలానికి చెందిన జర్నలిస్టు తులసి బంధువులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అసర్ల యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.



మేడారం వెళ్లే బస్సులో ఎక్కుతున్న భక్తులు

హుస్నాబాద్‌లో మేడారం భక్తుల రద్దీ

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: హుస్నాబాద్ నుంచి మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివెళ్తున్నారు. బుధవారం రాత్రి సారలమ్మ గద్దెకు వస్తుండటంతో ఉదయం నుంచే భక్తులు మేడారం బాట పట్టారు. హుస్నాబాద్ నుంచి దాదాపు 65 బస్సులను ప్రత్యేకంగా ఈ జాతరకు కేటాయించారు. పట్టణంలోని బస్టాండ్‌లో ప్రత్యేక బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు కంట్రోల్ రూమ్, ఇతర సౌకర్యాలను కల్పించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి రాత్రి ఏడు గంటల వరకు 32 బస్సులు మేడారానికి సర్వీసు చేయగా దాదాపు 1,500 మంది భక్తులు ఈ బస్సుల ద్వారా వెళ్ళినట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బస్టాండ్‌లో హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్‌ఐ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పెద్దమ్మ ఉత్సవాల్లో దుబ్బాక ఎమ్మెల్యే



అనాజీపూర్‌లో పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, ఫిబ్రవరి 21: మండలంలోని అనాజీపూర్‌లో పెద్దమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అనాజీపూర్‌లో పర్యటించి పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు ఫర్వేజ్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

రాయపోల్, ఫిబ్రవరి 21: ఉపాధిహామీ కూలీల పెండింగ్ బకాయలను వెంటనే చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దారెవపల్లి, రాంసాగర్, కొత్తపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెద్దారెవపల్లిలో రెండేళ్ల క్రితం కూలీలు చెరువులో పనిచేస్తే కొంత మంది కూలీలకు ఇంత వరకు వేతనాలు అందలేదన్నారు. అలాగే గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.

లద్నూరు పీహెచ్‌సీ తనిఖీ

మద్దూరు, ఫిబ్రవరి 21: మండలంలోని లద్నూరులో 24 గంటల పీహెచ్‌సీని బుధవారం హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయానికి వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం హాజరు రిజిష్టర్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. మార్చి 3 నుంచి పల్స్‌పోలియో కార్యక్రమం ఉన్నందున అందరు అలర్ట్‌గా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా డీప్రిడ్జ్‌లను చెక్ చేసినట్లు తెలిపారు.

హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులకు గ్రహణం

● చివరి దశలో ఆగిన మున్సిపల్ భవనం ● ఎక్కడివక్కడే ఎల్లమ్మ చెరువు టూరిజం పనులు



నత్తనడకన సాగుతున్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు



నిలిచిపోయిన ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: హుస్నాబాద్ మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ పనుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఏళ్ల తరబడి నత్తనడకన సాగిన పనులను ప్రస్తుతం కాంట్రాక్టర్లు తాము చేయలేమంటూ చేతులెత్తేశారు. ముఖ్యంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ భవనం చివరి దశలో, ఎల్లమ్మ చెరువు టూరిజం పనులు, రైతు బజార్, సమీకృతమార్కెట్ వంటి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

చివరి దశలో నిలిచిన మున్సిపల్ భవనం

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణం పనులకు కొన్నేళ్లుగా గ్రహణం వీడటం లేదు. కొన్నాళ్లు స్థల సమస్యతో నిలిచిపోయింది. ప్రస్తుతం నిధుల లేమితో పనులు చివరి దశలో ఆగిపోయాయి. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి 2022 ఫిబ్రవరి 8న అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. రూ. 2కోట్లతో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో నిర్మాణం జరుగుతున్నది. దీనికి దాదాపు రూ. 3 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయింది. మిగతా పనులకు నిధుల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

ఎక్కడివక్కడే ఎల్లమ్మ చెరువు టూరిజం పనులు

పట్టణంలోని ఎల్లమ్మ చెరువు టూరిజం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారాయి. టూరిజం శాఖ నుంచి రూ. 3కోట్లు మంజూరు కాగా ఇందులో వాకింగ్ ట్రాక్, బోటింగ్, లైటింగ్ పోల్స్, వాటర్ సప్లయ్ పైపులైన్, బతుకమ్మ విగ్రహం వంటి పనులుండగా ఇందులో కాంట్రాక్టర్ రూ. 1 కోటి వరకు పనులు చేసి నిలిపి వేశారు. అలాగే పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో రూ. 2.75 కోట్లతో చేపట్టిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి 2022 ఫిబ్రవరిలో శంకుస్థాపన జరిగినప్పటికీ నేటికీ పూర్తికాలేదు. పట్టణంలోని చావడి వద్ద రైతు బజారు నిర్మాణ పనులు కూడాఆగుతూ సాగుతున్నాయి. అర్ధాంతరంగా అభివృద్ధి పనులపై మంత్రి పొన్నం దృష్టి సారించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరభాష అభ్యసనం మాతృభాషకు అడ్డంకి కావొద్దు

● పాఠశాలల్లో ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

వర్గల్, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనంపై వివరించారు. పరభాష అభ్యసనం మాతృభాషకు అడ్డంకి కాకూడదని, తాను కూడా మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అభ్యసించానని తెలిపారు. అనంతరం విద్యార్థులు కుమారి సహస్ర, మనస్విని, మాస్టర్ రుత్విక్, సాహితి, సుదీక్ష, మహలక్ష్మి ఉపన్యాసం, కవితల రూపంలో తెలుగు భాష గొప్పతనాన్ని చాటారు. తెలుగు భాషపై నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు విజయ్‌కుమార్‌తో పాటు అధ్యాపలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **గజ్వేల్‌టౌన్:** ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సెయింట్‌మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డిగారు మాట్లాడుతూ సొంత భాషపై పట్టు ఉన్నట్లయితే ఇతర భాషలను సులభంగా నేర్చుకోవచ్చన్నారు. తల్లిలాంటి మాతృభాష తెలుగును కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **కొండపాక:** కొండపాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కుకునూర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొండపాక జడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులు భువన విజయం నాటక ప్రదర్శన చేశారు. తెలుగు భాష గొప్పతనం, మాతృభాష అభిమానాన్ని చాటేలా విద్యార్థులు నాటకాన్ని ప్రదర్శించారు. భువన విజయాన్ని ప్రదర్శించిన విద్యార్థులను, దర్శకత్వం వహించిన తెలుగు ఉపాధ్యాయురాలు జి. సత్యలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.విఠల్ నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా కుకునూర్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో మాతృ వందనం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం జరిపారు. అష్టావధానిగా బండి అంజయ్యగౌడ్, సంచాలకులుగా కవి అమ్మన చంద్రారెడ్డి వ్యవహరించారు. విద్యార్థులకు అవధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మండలంలోని వేచరేణి జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులు తెలుగు కవుల వేషధారణతో ప్రదర్శన చేపట్టారు. 60 తెలుగు సంవత్సరాల పేర్లతో పద్యపఠనం చేశారు. ప్రతిభ కనబరిచినవారిని ఉపాధ్యాయులు అభినందించారు.

● **మిరుదొడ్డి:** మిరుదొడ్డి మండలం ఆరెపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి విద్యార్థులతో పలకలపై అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని రాయించి అవగాహన కల్పించారు.



వర్గల్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



కొండపాక జడ్పీహెచ్ఎస్‌లో భువన విజయం నాటక ప్రదర్శనలో విద్యార్థులు



చేర్యాల: తెలుగు కవుల వేషధారణలో వేచరేణి జడ్పీఎస్ఎస్ విద్యార్థుల ప్రదర్శన